

## రాజస్థాన్ వెళ్లనున్న బాలయ్య

1986లో వరుసగా ఆరు బ్లాక్‌బాస్టర్లు ఇచ్చి సిక్సర్ కొట్టారు బాలకృష్ణ. ఇది ఇప్పటికీ చెరగని రికార్డు. వరుసగా ఆరు హిట్లు చాలామంది హీరోలకున్నా.. ఒకే ఏడాదిలో ఆరు హిట్లు మాత్రం నేటి హీరోల్లో బాలయ్యకు మాత్రమే సొంతం. ఇప్పుడు వరుసగా అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్‌కేసరి.. మూడు బ్లాక్‌బాస్టర్లు.. బాలయ్య స్థాయి హీరోలెవ్వరికీ ఈ పదేళ్లల్లో ఈ రికార్డ్ లేదు. త్వరలో నాలుగో సినిమా రాబోతున్నది. 'ఎన్‌బీకే 109' వర్కింగ్ టైటిల్‌గా రూపొందుతోన్న ఈ చిత్రానికి కె.ఎస్.రవీంద్ర(బాబి) దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఎస్.నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వరుసగా మూడు విజయాల తర్వాత బాలయ్య చేస్తున్న సినిమా కావడం, మెగాహిట్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ చేస్తున్న సినిమా కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా అప్‌డేట్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్శకుడు బాబీ ఈ సినిమాపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'ఈ సినిమా ఎలా ఉంటుంది? అంటూ అభిమానులు అడుగుతున్నారు. వాళ్లకు నేను చెప్పేది ఒక్కటే. ఈ సినిమా నెక్ట్స్ లెవల్లో ఉంటుంది. ఇందులో కొత్త బాలయ్యను చూస్తారు. ఊటీలో ఓ భారీ యాక్షన్ షెడ్యూల్ పూర్తి చేశాం. నెక్ట్స్ షెడ్యూల్ రాజస్తాన్‌లో చేయనున్నాం. మిగతా వివరాలు వచ్చే ఏడాదిలో చెప్తా' అన్నారు దర్శకుడు బాబీ.



## కథ విని ట్రాన్స్‌లో ఉండిపోయాను

'సలార్' వసూళ్లలో దూసుకుపోతున్నది. ఈ వేగం ఎందాకా సాగుతుందో చూడాలి. ప్రభాస్ కెరీర్‌లోని భారీ విజయాల్లో ఒకటిగా 'సలార్'ను చెప్పుకుంటున్నారు. ఇదిలావుంటే ఈ సినిమా గురించి ఓ హాలీవుడ్ మీడియా ఇంటర్వ్యూలో ప్రభాస్ మాట్లాడారు. ' నా కెరీర్‌లో చేసిన విభిన్న పాత్రల్లో 'సలార్' ఒకటి. ప్రశాంత్‌నీల్ కథ చెప్పగానే కాసేపు అదే ట్రాన్స్‌లో ఉండిపోయాను. నిజంగా సవాల్‌తో కూడుకున్న పాత్ర ఇది. అందుకే వెంటనే అంగీకరించాను. 'బాహుబలి' నా కెరీర్‌కు ఒక బెంచ్‌మార్క్‌ను క్రియేట్ చేసింది. ఆ సినిమా తర్వాత కథల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి నాకు నెలకొంది. జనాల మైండ్ సెట్‌లో కూడా మార్పు వచ్చింది. మూస సినిమాలను ఇష్టపడటంలేదు. అందుకే కొత్తగా వెళ్లాలనే మంచి కథలు ఎంచుకుంటున్నాను. ప్రస్తుతం ప్రపంచం భారతీయ సినిమాలవైపు చూస్తున్నది. బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మల్లూవుడ్ అని కాకుండా భారతీయ సినిమా పరిశ్రమగా ప్రపంచం మనల్ని గుర్తిస్తున్నది. దీనికి రాజమౌళి, ప్రశాంత్‌నీల్ లాంటి దర్శకులే కారణం. వారితో కలిసి పనిచేయడం నిజంగా గొప్ప అనుభూతి. 'సలార్' పార్ట్2 మరింత అద్భుతంగా ఉంటుంది' అంటూ చెప్పుకొచ్చారు ప్రభాస్.




## యువతకు స్ఫూర్తినిచ్చే కథ

రోషన్ కనకాల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. రవికాంత్ పేరేపు దర్శకుడు. మానస కథానాయిక. ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రీబుకింగ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకలో అడివి శేష్, విశ్వక్‌సేన్, సిద్ధు జొన్నలగడ్డ, నందిని రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అడివి శేష్ మాట్లాడుతూ 'కొడుకు హీరోగా లాంచ్ అవుతుంటే పేరెంట్స్ కళ్లలో ఓ ఆనందం ఉంటుంది. అది సుమ, రాజీవ్ కళ్లలో కనిపిస్తున్నది. రోషన్ పెద్ద హీరో అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.' అన్నారు. ఈ సినిమాలో రోషన్ నటన చూస్తుంటే కొత్తవాడిలా అనిపించడం లేదని హీరో విశ్వక్‌సేన్ అన్నారు. రోషన్ కనకాల మాట్లాడుతూ 'ఈ సినిమాలో అందరికీ కనెక్ట్ అయ్యే ఎమోషన్స్ ఉంటాయి. మనందరి నసీబ్‌లో ఏం రాసిపెట్టుందో ఎవరికీ తెలియదు. కానీ నచ్చినట్లు మార్చుకోవాలి అనే స్ఫూర్తివంతమైన సందేశం ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కూడా ఈ కథ బాగా నచ్చుతుందని, రోషన్ ఈ సినిమాతో పెద్దహీరోగా అవతరిస్తాడని దర్శకుడు రవికాంత్ పేరేపు నమ్మకం వెలిబుచ్చారు. యువతకు సందేశాన్నందించే కథ ఇదని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు.




## అందరికీ కనెక్ట్ అయ్యే 'ముఖ్య గమనిక'

విరాన్ ముత్తంశెట్టి కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. వేణు మురళీధర్ దర్శకుడు. శివిన్ ప్రొడక్షన్స్ పతాకంపై రాజశేఖర్, సాయికృష్ణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. లావణ్య కథానాయిక. ఈ సినిమాలో 'ఆ కన్నుల చూపుల్లోనా..' అంటూ సాగే ఫస్ట్ లిరికల్ సాంగ్‌ను దర్శకుడు బాబీ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'వినూత్న కథాంశంతో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాం. తప్పు చేయాలన్న ఆలోచన వచ్చి దానిని సరిదిద్దుకునే లోపే కొన్ని అనర్థాలు జరుగుతాయి..ఈ పాయింట్ ఆధారంగా నడిచే కథ ఇది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి' అన్నారు. తమ సంస్థకిది తొలిచిత్రమని, త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం, సాహిత్యం: కిరణ్ వెన్న, దర్శకత్వం: వేణు మురళీధర్.వి.



## అందుకే ఇదిమాకు స్పెషల్ డే..

'శాంటా నాకిచ్చిన బహుమతివి నువ్వు. నీ నవ్వు, నీ జాలిగుణం.. నీ మంచితనం, నీ ప్రేమ నాకు వరం. హ్యాపీ బర్త్‌డే బేబీ.. ఇకనుంచి ప్రతి రోజూ నువ్వు కోరుకున్నవన్నీ సమృద్ధిగా నీకు దొరకాలి. హ్యాపీ క్రిస్మస్..' అంటూ పోస్ట్ పెట్టింది రకుల్‌ప్రీత్‌సింగ్. క్రిస్మస్ రోజునే తన ప్రియుడు జాకీ భగ్నానీ పుట్టినరోజు కూడా కావడంతో తన ప్రియబాంధవుడికి తన సోషల్‌మీడియా ద్వారా అక్షరాలతో ప్రేమను కురిపించేసింది రకుల్ ప్రీత్. ఈ సందర్భంగా అభిమానులు అడిగిన ప్రశ్నలకు కూడా ముద్దు ముద్దు సమాధానాలిచ్చేసింది. 'మా ప్రేమకు రెండేళ్లు. క్రిస్మస్‌రోజునే తను పుట్టాడు. ఇదేరోజు సరిగ్గా రెండేళ్ల క్రితం మాలో ప్రేమ చిగురించింది. అందుకే ఇది మాకు స్పెషల్‌డే.' అని చెప్పింది రకుల్. మరి పెళ్లెప్పుడు? అనడిగితే.. 'జీసెస్ ఎప్పుడంటే అప్పుడు..' అంటూ తెలివిగా సమాధానమిచ్చేసింది.



## థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో 'అగ్లీ స్టోరీ'

నందు, అవికా గోర్ జంటగా నటిస్తున్న చిత్రం 'అగ్లీ స్టోరీ'. ప్రణవ స్వరూప్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను ఇటీవల విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఊహల్లోని ప్రేమ నిజ జీవితంలో ఉండదనే థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం.ప్రేమ తాలూకు యువతీయువకుల ఆలోచనలను వాస్తవిక కోణంలో ఆవిష్కరిస్తుంది. నందు పాత్రతో నేటి యువత బాగా కనెక్ట్ అవుతారు. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌కు మంచి స్పందన లభిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో టీజర్, ట్రైలర్‌ను విడుదల చేస్తాం' అన్నారు. రవితేజ మహాదాస్యం, శివాజీ రాజా, ప్రజ్ఞా నయన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీసాయికుమార్ దారా, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, సాహిత్యం: భాస్కరభట్ల, వరికుప్పల యాదగిరి, కడలి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: ప్రణవ స్వరూప్.

## ఆయనతో పోటీపడి నటించా..

అందంగా ఉండేవాళ్లకు అభినయకౌశలం ఉండాలని లేదు. కానీ.. ప్రియాంకకు రెండూ మెండుగా ఉన్నాయి. అందుకే సదరన్ సినిమాలో దూసుకుపోతున్నది ప్రియాంక. తమిళంలో అయితే చేతినిండా సినిమాలే. తెలుగులో పవన్‌కల్యాణ్ 'ఓజీ'లో ప్రియాంకే కథానాయిక. ప్రస్తుతం తాను తమిళంలో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. ఈ సినిమాలో తొలిసారి డీ గ్లామరైజ్డ్ కేరక్టర్ చేస్తున్నది ప్రియాంక. ఈ పాత్ర గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ఇది పెక్యులర్ సబ్జెక్ట్. ఈ కథలో ఉన్న ప్రతి పాత్రా వైవిధ్యమైనదే. అన్ని పాత్రలూ ఛాలెంజింగ్ రోల్సే. దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ ఎంతో రీసెర్చ్ చేసి తయారు చేసుకున్న కథ ఇది. మూడేళ్ల క్రితమే ఈ కథ రెడీ చేశారాయన. ఓ విధంగా ఆ కథే పాత్రధారులను ఎంపిక చేసుకుంది అనాలి. అందరూ సరిగ్గా సెట్ అయిపోయారు. ముఖ్యంగా ధనుష్‌సార్. ఇందులో ఆయన నట విశ్వరూపాన్ని చూస్తారు. ఆయనతో పోటీపడి నటించే పాత్ర నాది. నా కెరీర్‌లో నిలిచిపోయే పాత్ర అని చెప్పొచ్చు.' అని ఉద్వేగంగా చెప్పుకొచ్చింది ప్రియాంక అరుళ్‌మోహన్.



తెలంగాణ ముఖ్యమంతి రేవంత్‌రెడ్డిని అగ్రనటుడు చిరంజీవి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి స్వగృహంలో ఆయన్ను కలిసిన చిరంజీవి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కొద్దిసేపు జరిగిన వీరి భేటీలో పరిశ్రమకు సంబంధించిన పలు విషయాలు చర్చించినట్టు సమాచారం.



## ముస్తాబవుతున్న 'గుంటూరు కారం'

మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'గుంటూరు కారం' చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఇటీవల విడుదల చేసిన పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. ప్రస్తుతం ఈ సినిమా తుదిదశ చిత్రీకరణలో ఉంది. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో నాయకానాయికలపై రొమాంటిక్ గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ పాట చిత్రీకరణను పూర్తి చేయబోతున్నారు. దీంతో సినిమా షూటింగ్ మొత్తం పూర్తయినట్లేనని చిత్రబృందం తెలిపింది. శ్రీలీల, మీనాక్షి చౌదరి, ప్రకాష్‌రాజ్, బ్రహ్మానందం, జగపతిబాబు, జయరాం తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకురానుంది.

